
సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 25 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కారుకొండ రమేష్ చౌదరి (మండపేట) రూ.67,500 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.75 అడుగులకు చేరింది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2023 మంగళవారం ప్రారంభమయ్యాయి.

8 లో

న్యూస్‌రీల్

నేడు కేంద్ర మంత్రి చౌహాన్ పర్యటన

కడియం: కేంద్ర కమ్యూనికేషన్ల సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ బుధవారం కడియం మండలంలో పర్యటించనున్నట్టు ఎంపీడీవో కె. రత్న కుమారి తెలిపారు. ఆయన మధ్యాహ్నం రెండు గంటలకు కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడతారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనులను పరిశీలిస్తారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో కడియం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డీఎల్‌డీవో వీణాదేవి సమీక్షించారు. ఎంపీడీవో కె.రత్న కుమారి, తహసీల్దార్ ఎం.సుజాత, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



మాధవీలత, కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలనే నినాదంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 15,52,268 మంది ఓటర్లు ఉండగా , వారిలో పురుషులు 7,61,026 మంది, మహిళలు 7,91,128 మంది, ఇతరులు 114 మంది ఉన్నారన్నారు. వీరిలో 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసున్న యువ ఓటర్లు 13,957 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గ, పోలింగ్ బూత్ స్థాయిలో కూడా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుగుతుందన్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం

కడియం: మండలంలోని వేమగిరిలో 20 కేజీల గంజాయిని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన యార్లగడ్డ రాంబాబు, బండారు వెంకటేశ్వర్లు, దుళ్లకు చెందిన బాలుడు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వీరిలో రాంబాబు గంజాయి తీసుకువచ్చి, మిగిలిన ఇద్దరితో గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వేమగిరి ప్రకృతి ఆశ్రమం సమీపంలో గంజాయితో ఉన్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20,590 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం శ్రీరాంపురానికి చెందిన మహేష్ అనే వ్యక్తి వీరికి గంజాయి సరఫరా చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వేదవల్లి

ధవళేశ్వరం: పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ పీఏటు స్పెషల్ కలెక్టర్‌గా కె.వేదవల్లి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయం సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

హైకోర్టు జడ్జిగా పదోన్నతి



వెంకట జ్యోతిర్మయి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకట జ్యోతిర్మయికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు న్యూఢిల్లీ మినిస్ట్రీ ఆఫ్ లాఅండ్ జస్టిస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జ్యోతిర్మయి 2022 ఏప్రిల్ 18వ తేదీన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు సాయి తన్మయి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ రైఫిల్ షూటింగ్ పోటీలకు కాకినాడకు చెందిన పి.సాయి తన్మయి ఎంపికైంది. స్థానిక జిల్లా క్రీడామైదానంలో రైఫిల్ షూటింగ్ అకాడమీలో కోచ్ సమీర్ వద్ద శిక్షణ పొందుతున్న తన్మయి ఆదికవి నన్నయ యూనివర్శిటీలో ఈనెల 23న జరిగిన ఎంపికల్లో పాల్గొంది. రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఉత్తరప్రదేశ్‌లో ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు జాతీయ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో నన్నయ తరుపున తన్మయి ఆడుతుంది. యూనివర్శిటీ స్థాయిలో బంగారు పతకం సాధించిన తన్మయను మంగళవారం డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్, కోచ్ సమీర్‌లు అభినందించారు.

పంచాయతీలకు పన్నుపోటు



- మందగించిన పన్నుల వసూలు
- బకాయిలతో కలిపి డిమాండ్ రూ.70.43 కోట్లు
- ఇప్పటివరకు రూ.23.01 కోట్ల వసూలు
- సమీపిస్తున్న ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు

ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల వివరాలు (రూ.లలో)

డివిజన్	పంచాయతీలు	డిమాండ్	వసూలు అయినది	వసూలు చేయాల్సింది
రాజమహేంద్రవరం	147	53,81,44,419	17,12,85,299	36,68,59,120
కొవ్వూరు	153	16,62,01,030	5,88,92,742	10,73,08,288

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వనరులను సమీకరించుకోవడం, పన్ను వసూలు, ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లకు సంబంధించిన నిధుల పరిపుష్టితోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుత పాలక వర్గాలు ఆ దిశగా అడుగులు వేయకుండా, కేవలం ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లపైనే ఆధారపడుతుండటంతో అభివృద్ధి మందగించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు తోడుగా గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే పంచాయతీల ఖాతాల్లో నిధులు జమయ్యే అవకాశాలు ఉంటాయి. గ్రామ పంచాయతీల్లో వసూలు చేయాల్సిన పన్నులు, పన్నేతరాలకు సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్ ప్రతి వారం సమీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టింది. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండున్నర నెలలు మాత్రమే ఉండడంతో పన్నుల వసూలు ప్రక్రియ వేగం పుంజుకుంది.



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం



గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు

సర్పంచ్‌ల పాత్ర కీలకం

గ్రామ పంచాయతీల పరిధిలో పన్నుల వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించుకునే విషయంలో గ్రామ సర్పంచ్‌లది కీలకపాత్ర. ఆయా పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. అయినా వివిధ గ్రామాల సర్పంచ్‌లు పన్ను వసూలుపై పెద్దగా దృష్టి సారించనట్లు తెలుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్లపైనే పాలక వర్గాలు దృష్టి కేంద్రీకరించాయే తప్ప స్థానిక వనరుల నుంచి వచ్చే ఆదాయాలను పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో పన్నులు (ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను), పన్నేతరాల (మార్కెట్ వేలాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెలు, లైసెన్సు ఫీజులు, కుళాయి ఫీజులు, భవన నిర్మాణ ఫీజులు) రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో సర్పంచ్‌లు ప్రధాన పాత్రను పోషించాలి.

సమష్టి కృషి అవసరం

గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచుకునే అంశంలో క్షేత్రస్థాయి అధికారులు సమష్టిగా కృషి చేయాలి. అనేక పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికీ లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని పంచాయతీల్లో 50 శాతం భౌగోళికంగా విస్తరించాయి. ఈ నేపథ్యంలోనే ఆయా పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. కొత్తగా గ్రామ శివారుల్లో ఏర్పాటవుతున్న కాలనీలు, కొత్త ఇళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఆయా పంచాయతీలు ప్రత్యక్షంగా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నట్లు తెలుస్తోంది. వాటిపై దృష్టి సారిస్తే ఆదాయం పెరుగుతుంది.

వేగవంతం చేశాం



ఇంటి పన్నుల వసూలును వేగవంతం చేశాం. నెలాఖరుకు 80 శాతం ఇంటి పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశాం. గ్రామ పంచాయతీలలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, బిల్ కలెక్టర్లు సంయుక్తంగా ఇంటి పన్నుల వసూలుపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్అండ్ఆర్డీలు పంచాయతీ కార్యదర్శులను పన్నుల వసూలుపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకునే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

– పి.జగదాంబ, జిల్లా పంచాయతీ అధికారి

28 నుంచి బాలాలయంలో తలుపులమ్మ దర్శనాలు

- రెండు రోజులు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు



శరవేగంగా నిర్మిస్తున్న తలుపులమ్మ తల్లి బాలాలయం

తుని రూరల్: బాలాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటల నుంచి తలుపులమ్మ అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. రూ.ఐదు కోట్లతో తలుపులమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం, మహామండప నిర్మాణం జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. లోవ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపై అమ్మవారి దర్శనాలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రెండు రోజులు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆగమ శాస్త్ర పండితుల సూచనలతో దేవస్థానం ప్రాంగణ మెట్లమార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద బాలాలయంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఉత్తరాయణ పుణ్యకాలంలో అమ్మవారి బాలాలయం ఏర్పాటు, పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో కళాపకర్షణ, 27న మధ్యాహ్నం 2.45 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఉదక శాంతి జరుగుతాయన్నారు. 28న మృత్తికా పూజ, నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలక, మండప ఆరాధన, ఉదయం 9.37 గంటలకు కలశ స్థాపన, నీరాజన మంత్ర పుష్పాలు, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. ప్రధానాలయంలో ఎప్పటిలాగే ప్రాతఃకాల అర్చన, బాలభోగం, మహానివేదన, సాయంత్రం అవసర నివేదన, అనంతరం పూజలు ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. బాలాలయం నిర్మాణం, విగ్రహ ఏర్పాట్లు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

మార్కెట్‌లోకి కొత్త కార్లు విడుదల



హ్యుండాయ్ గ్రాండ్ ఐ-10 నియోస్, ఆరా కార్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్

రాజమహేంద్రవరం రూరల్: కార్ల దిగ్గజం హ్యుండయ్ 'గ్రాండ్ ఐ–10 నియోస్', 'ఆరా' కార్లను సోమవారం స్థానిక లాలాచెరువు నేషనల్‌హైవేలో లక్ష్మీ హ్యుండాయ్ షోరూమ్‌లో మార్కెట్‌లోకి విడుదల చేశారు. సరికొత్త ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, నాలుగు ఎయిర్ బాగ్స్, టైప్ సీ ఛార్జింగ్ , క్రూయిస్ కంట్రోల్, ఫుట్వెల్ లైటింగ్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎల్ఈడీ లాంప్ విత్ కన్కెక్టెడ్ డిజైన్ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఫీచర్స్ గ్రాండ్ఐ10 నియోస్ లో ఉన్నాయని లక్ష్మీ హ్యుండాయ్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ తెలిపారు. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, వెహికల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్, అడ్జెస్టబుల్ హెడ్ రెస్ట్, వైర్లెస్ ఫోన్ చార్జర్ ,ఆటో హెడ్ లాంప్‌ల వంటి అధునాతన ఫీచర్స్‌తో ఆరా కార్లో సమకూర్చారన్నారు. అదనంగా రెండు సరికొత్త డ్యూయెల్‌టోన్ రంగులలో నియోజ్ కారు లభిస్తుందన్నారు. చార్టెడ్ అకౌంటెంట్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్ చేతులమీదుగా ఈ కార్లను ఆవిష్కరించారు. మొదటి కొనుగోలుదారుడు మానేపల్లి సూర్యఅభిషిత్‌కు తాళం చెవి అందజేశారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, లక్ష్మీహ్యుండాయ్ సిబ్బంది వీరేష్,రవి కుమార్, కోటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజుకు ఎంపీ పరామర్శ



ఎమ్మెల్యే తెల్లం బాలరాజును పరామర్శిస్తున్న ఎంపీ భరత్ రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలవరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు తెల్లం బాలరాజును రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మంగళవారం పరామర్శించారు. ఉదయం గుండెపోటు రావడంతో ఆయన్ను ఇక్కడి సాయి హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వైద్యులు ఎమ్మెల్యే బాలరాజును పరీక్షించి గుండెలో స్టంట్ అమర్చారు. ఆయన కోలుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి గణేష్ తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పోలవరం నియోజకవర్గ పార్టీ నేతలు సాయి హాస్పిటల్‌కు వచ్చి బాలరాజును పరామర్శించారు.

నేషనల్ రైఫిల్ షూటింగ్‌కి 'నన్నయ' టీమ్



రైఫిల్ షూటింగ్ టీమ్ సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న నన్నయ రిజిస్ట్రార్ అశోక్

రాజానగరం: నేషనల్ రైఫిల్ షూటింగ్‌కి ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున మెన్ అండ్ ఉమెన్ టీమ్‌ని ఎంపిక చేసేందుకు మంగళవారం నిర్వహించిన సెలక్షన్స్‌ను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రారంభించారు. గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి 20 మంది హాజరు కాగా, వారిలో ప్రతిభ చూపిన ఆరుగురు మెన్ అండ్ ఉమెన్‌లను ఎంపిక చేశారు. ఫిబ్రవరి 15 నుంచి హరిద్వార్‌లోని స్వామి వివేకానంద సుబర్తి యూనివర్సిటీలో జరిగే పోటీలు వీరు హాజరవుతారని స్పోర్ట్సు బోర్డు కోఆర్డినేటర్ డాక్టర్ కె. సుబ్బారావు తెలిపారు.

ఖాతాదారులకు గోల్డ్‌మాల్

కాకినాడ క్రైం: కాకినాడలోని యూకో బ్యాంకు కేంద్రంగా ఓ బ్యాంకు ఉద్యోగి రూ.2.5 కోట్ల భారీ మోసానికి పాల్పడి 40 మంది ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టాడు. వివరాల్లోకి వెళితే, నగరంలోని ఆనంద భారతి మైదానం ఎదురు వీధిలో ఉన్న సూర్యారావుపేట యూకో బ్యాంకులో కాకినాడ రామకృష్ణారావు పేటకు చెందిన తాడోజు శ్రీనివాసరావు పదేళ్లుగా గోల్డ్ లోన్ విభాగంలో అప్రయిజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా చేతివాటం ప్రదర్శించి సుమారు 40 మంది ఖాతాదారులను నిలువునా ముంచాడు. వారిలో కొందరి అసలు బంగారాన్ని పక్కదారి పట్టించి ఆ స్థానంలో నకిలీ బంగారాన్ని తీసుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా బ్యాంకులో పెట్టాడు. తన వద్ద బంగారం ఉందనీ, అయితే తమ బ్యాంకులో తమకి లోన్ ఇవ్వరనీ నమ్మబలికాడు. కాబట్టి మీ డాక్యుమెంట్లతో లోన్ తీసుకుంటాననీ, తన బంగారం తానే తాకట్టు పెట్టుకుంటానని నమ్మించాడు. బ్యాంకుకి వచ్చి సంతకం చేస్తే చాలనీ ..వచ్చే లోన్‌లో కొంత మొత్తాన్ని పర్సంటేజీగా ఇచ్చేస్తానని ఎరవేశాడు. శ్రీనివాస్ మోసాన్ని గుర్తించలేకపోయిన పలువురు ఖాతాదారులు అతడి వలలో చిక్కుకొని సంతకాలు పెట్టి బాధ్యులయ్యారు. భారీ మోసంలో బాధితులయ్యారు. లాకర్ తనిఖీలలో బంగారం నాణ్యతపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం ఖాతాదారులకు 'మీ ఆభరణాలు నకిలీవి' అంటూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఖాతాదారులంతా మూడు రోజులుగా బ్యాంకుకు క్యూ కట్టారు. ఈ తంతులో శ్రీనివాస్ నిర్వాకంపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారమంతా బట్టబయలైంది.

రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట

- ఈ ఏడాది డిసెంబర్‌కు రీసర్వే పనులు పూర్తి
- రాష్ట్రంలో 2 వేల గ్రామాల్లో రెండో దశ భూసర్వే
- సీఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లం
- కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లం

సాక్షి, రాజమహేంద్రవరం/సీటీఆర్ఐ: భూవివాదాలకు తెరదించేందుకు రాష్ట్రంలో చేపడుతున్న రీసర్వేలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేయాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని, దానికి అనుగుణంగానే నిర్దిష్ట కాలవ్యవధిలో చట్టబద్ధంగా సర్వే చేపట్టాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు, వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష పథకం స్టీరింగ్ కమిటీ అమలు చైర్మన్ అజయ్ కల్లం సూచించారు. రీసర్వే పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై స్థానిక కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో మంగళవారం ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. ఈ సుదీర్ఘ భేటీలో భూ సమస్యలకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.

అర్జీలకు పూర్తిస్థాయి పరిష్కారం

అజయ్ కల్లం మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో దశలో రెండు వేల గ్రామాల్లో ఫిబ్రవరి నాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం సమయంలో జిల్లా ఉన్నతాధికారులు రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా లబ్ధిదారుల భూమికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోవాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి రీసర్వే పనులను పూర్తి చేసి, హక్కు పత్రాలు అందజేయడంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిపై నెలకొన్న అనుమానాలను సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్‌లతో మరోసారి చర్చించి పరిష్కారం చూపుతామన్నారు. సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వేలో రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. క్షేత్ర స్థాయిలో రికార్డులను పరిశీలించి అక్కడికక్కడే తప్పులు సరిదిద్ది సమస్య పరిష్కరించాలని సూచించారు. సీసీఎల్ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ సర్వే అధికారులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకొనే దిశలో టెలికాన్ఫరెన్స్ పరికరాలను సర్వేశాఖ ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. మ్యూటేషన్ దరఖాస్తు ఆమోదించిన, తిరస్కరించిన కారణాలను అక్కడికక్కడే సమీక్షించాలన్నారు.

ఏడు మండలాల్లో రీసర్వే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని 7 మండలాల పరిధిలో ఉన్న 52 గ్రామాలు, 121 హాబిటేషన్స్‌కు చెందిన గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేశాం. 62 మ్యూటేషన్, 65 క్లరికల్ తప్పిదాలు, 66 పాత సర్వే నెంబర్ల తప్పులు, 66 మిస్‌మ్యాచ్ అర్జీలకు పరిష్కారం చూపాం.

– డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర

2,836 మ్యూటేషన్ అర్జీలకు పరిష్కారం

ఏలూరు జిల్లా పరిధిలో 689 గ్రామ పంచాయతీలో సర్వే చేయాల్సి ఉండగా.. తొలి దశలో 80 గ్రామాల్లో పూర్తి చేశాం. 24,506 జేబీహెచ్ పట్టాలకు గాను 20,385 పంపిణీ చేశాం. 2,836 మ్యూటేషన్ అర్జీలు, 526 క్లరికల్, 161 పాత సర్వే నెంబర్లు, 323 మిస్‌మ్యాచ్ అర్జీలను పరిష్కరించాం.

–ప్రసన్న వెంకటేష్, ఏలూరు కలెక్టర్

తూర్పులో 44 గ్రామాల్లో పూర్తి

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 272 గ్రామ పంచాయతీల పరిధిలోని 6,05,332 ఎకరాల్లో రీసర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి దశలో 44 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. ఇందుకు సంబంధించి 19,865 జేబీహెచ్ (జగనన్న భూహక్కు) పట్టాలకు గాను 18,690 పంపిణీ చేశాం. మ్యూటేషన్ 2,768 అర్జీలు అందగా 2,300 పరిష్కరించాం. 1,967 వాటిల్లో చిన్నపాటి తప్పులు దొర్లాయి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తాం. పాత సర్వే నంబర్లలో తప్పులు సరిదిద్దేందుకు 654, భూమి కొలతల్లో అసమతుల్యత (మిస్ మ్యాచ్)కు 206 అర్జీలను పరిష్కరించాం.

– కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

46,223 జేబీహెచ్ పట్టాల పంపిణీ

కాకినాడ జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 207 గ్రామాలకు గాను 128 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. 49,658 జేబీహెచ్ పట్టాలకు గాను 46,223 పంపిణీ చేశాం. 110 మ్యూటేషన్ అర్జీలు పరిష్కరించాం. క్లరికల్ తప్పిదాలకు సంబంధించి 120, పాత సర్వే నంబర్లలో తప్పులు దిద్దే ప్రక్రియలో 120, మిస్ మ్యాచ్‌కు చెందిన 120 అర్జీలకు పరిష్కారం చూపాం.

– కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ

ఫిట్స్‌తో సైక్లిస్టు మృతి

కపిలేశ్వరపురం: సైకిల్‌పై ప్రయాణిస్తూండగా ఫిట్స్ రావడంతో అంగర గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాస్ (35) మంగళవారం ఉదయం మృతి చెందాడు. అంగర పోలీసుల కథనం ప్రకారం.. అంగర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సమీపాన నివసిస్తున్న శ్రీనివాస్ మాచరలోని అత్తవారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అంగర వస్తూండగా టేకి శివారు రేకుల చావిడి వద్దకు వచ్చేసరికి అతడికి ఫిట్స్ వచ్చాయి. దీంతో సైకిల్‌తో పాటు పక్కనే ఉన్న పొలంలో పడిపోయి మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఆరేళ్ల కుమార్తె, ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ తనూజ.. నిజాయితీకి నిలువెత్తు చిరునామా..

- రూ.1.42 లక్షలు పోగొట్టుకున్న వృద్ధురాలు
- అందజేసిన మహిళ
- అభినందించిన పోలీసులు



తనూజను సత్కరిస్తున్న సీఐ వీరబాబు, ఎస్సై పరదేశి తదితరులు

అమలాపురం రూరల్: ఒకటీ రెండు రూపాయలు కాదు.. ఏకంగా రూ.1.42 లక్షలతో ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకుందో ఓ వృద్ధురాలు. అంత మొత్తంతో బ్యాగ్ దొరికితే చాలామందికి దురాశ పుట్టడం ఖాయం. కానీ, తనకు దొరికిన ఆ బ్యాగ్‌లో ఒక్క పైసా కూడా తీసుకోకుండా.. బాధిత వృద్ధురాలికి అందజేసి, నిజాయితీకి నిలువెత్తు చిరునామాగా నిలిచింది ఆ మహిళ. వివరాలివీ.. అంబాజీపేట శివారు కోఠివారి అగ్రహారానికి చెందిన 64 ఏళ్ల వృద్ధురాలు పేరి మృదుల కుమారి అమలాపురంలోని ఓ బ్యాంక్‌లో సోమవారం రూ.1.42 లక్షలు డ్రా చేసింది. ఆ నగదును బ్యాగ్‌లో పెట్టుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైంది. మార్గం మధ్యలో బండారులంకలో ఓ కిరాణా దుకాణం వద్ద ఆగింది. ఆ సమయంలో నగదుతో ఉన్న బ్యాగ్‌ను పొరపాటున పడేసుకుంది. ఆ బ్యాగ్ బండారులంకకు చెందిన పెంటపాటి నాగ వెంకట తాయారు(తనూజ)కు దొరికింది. అందులో భారీ మొత్తంలో నగదుతో పాటు బ్యాంక్ పాస్‌బుక్ కూడా ఉంది. అంత డబ్బు తనకు దొరికిన విషయం ఎవ్వరికీ తెలియకపోయినా.. సొంతం చేసేసుకోవాలని తనూజ అనుకోలేదు. ఎంతో నిజాయితీగా పోగొట్టుకున్న వారికి అప్పగించే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈలోగా బ్యాగ్ పోగొట్టుకున్న మృదుల కుమారి అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు బండారులంక వచ్చి విచారణ ఆరంభించారు. ఆ విషయం తెలిసిన తనూజ తనకు నగదుతో దొరికిన బ్యాగ్‌ను చూపించింది. అది మృదుల కుమారిదేనని నిర్ధారణ కావడంతో ఆ నగదు బ్యాగ్‌ను ఆమెకు తనూజ అందజేసింది. ఆమె నిజాయితీకి మెచ్చిన రూరల్ సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్సై ఎ.పరదేశి స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో తనూజను అభినందించి, పోలీసుల తరఫున మంగళవారం ఘనంగా సత్కరించారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



సూరంపాలెం 'ఆదిత్య'లో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/గండేపల్లి/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2023 మంగళవారం ప్రారంభమయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యాన కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్ష కాకినాడ అయాన్ డిజిటల్ ఇనిస్టిట్యూట్, గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లలో నిర్వహించారు. అయాన్ ఇనిస్టిట్యూట్‌లో ఉదయం పరీక్షకు 516 మందికి గాను 513 మంది, మధ్యాహ్నం పరీక్షకు 515 మందికి గాను 509 మంది హాజరయ్యారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో తొలి రోజు పరీక్షకు 115 మందికి గాను 114 మంది హాజరయ్యారు. ఇక్కడ పరీక్షల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా ఎం.రాజబాబు వ్యవహరించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో ఉదయం పరీక్షకు 900 మందికి గాను 892 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 900 మందికి గాను 889 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో కూడా జరుగుతాయి.

యువకుడి కిడ్నాప్

- రూ.30 లక్షలు ఇవ్వాలని తల్లిదండ్రులకు ఫోన్
- సమిశ్రగూడెంలో ఘటన



కిడ్నాపైన వెంకటేష్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో యువకుడి కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. కోరుపల్లికి చెందిన నిచ్చెనకోళ్ల రాము, అతడి కుమారుడు వెంకటేష్ (25) నిడదవోలులో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరారు. వెంకటేష్ తన మోపెడ్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి బంక్‌లో ఆగాడు. తండ్రి రాము నిడదవోలు వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో సమిశ్రగూడెం – వేలివెన్ను మధ్య గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి వెంకటేష్‌ను కిడ్నాప్ చేశారు. అతడి మోపెడ్‌ను రోడ్డు పక్కనే పడవేశారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉదయం 7 గంటల సమయంలో వెంకటేష్ సెల్‌ఫోన్ నుంచి కిడ్నాపర్లు కాల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేశారని తండ్రి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై పరమహంస పరిశీలించి, కేసు నమోదు చేశారు. వెంకటేష్ ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు.

విధుల్లో చేరిన సబ్జెక్టు టీచర్లు

రాయవరం: పదోన్నతులు, మిగులు, సబ్జెక్టు కన్వర్షన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఈ నెల 22న రాజమహేంద్రవరంలో తూర్పు గోదావరి డీఈఓ ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు విడుదల కాలేదు. వెంటనే విధుల్లో చేరాల్సిందిగా వారికి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎస్ నుంచి గణితానికి కన్వర్షన్ కోరిన, పాఠశాలల్లో గణితం మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన 161 మంది, వివిధ కారణాలతో మిగులుగా ఉన్న ఎస్ఏ ఇంగ్లిష్ 41, సోషల్ 82, బయలాజికల్ సైన్స్ 43 మందిని సర్దుబాటు చేశారు. అలాగే ఎస్‌జీటీలుగా పని చేస్తున్న వారి నుంచి ఎస్ఏ గణితం 110, సోషల్ 49, బయాలజీ 33, ఇంగ్లిష్ 254 మందిని వారు కోరుకున్న స్థానాల్లో సర్దుబాటు చేశారు. సబ్జెక్టు కన్వర్షన్, సబ్జెక్టు మిగులు ఉపాధ్యాయులుగా ఉన్న 327 మందిని, ఎస్‌జీటీ నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులుగా సర్దుబాటు చేసిన 446 మందిని వారు పని చేస్తున్న స్థానాల నుంచి ఇతర స్థానాల్లో సర్దుబాటు చేశారు. వీరందరూ సర్దుబాటు జరిగిన స్థానాల్లో విధుల్లో చేరారు. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత తీరిందని తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

77 ఖాళీ పోస్టులకు కౌన్సెలింగ్

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న 77 పోస్టులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకా ఖాళీలు మిగిలి ఉంటే అన్నీ భర్తీ అయ్యే వరకూ సీనియారిటీ ప్రకారం ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశముంది.